
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 24.8 ; కనిష్ఠం 22.7

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 11 జూలై 2025



ఈ ఫొటోలో తాళం వేసి కనిపిస్తున్నది.. సిరికొండ మండలం మల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నిజాంగూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల.ఈ పాఠశాలలో ఏకోపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నాడు. ఇక్కడ 5వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలు పున: ప్రారంభమై నెలరోజులు గడిచి పోయిన ఉపాధ్యాయుడు సమయ పాలన పాటించడం లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఉపాధ్యాయుడు రాక పోవడంతో విద్యార్థులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఒక వేళ పాఠశాలకు వచ్చిన మధ్యాహ్నం తర్వాత బడికి తాళం వేసి కనిపిస్తుందని చెబుతున్నారు. మరెన్నో మారుమూల ఏజెన్సీ గ్రామాలలో ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి.


● ఉపాధ్యాయుడు రాకపోవడంతో బడి ముందు నిరసన తెలుపుతున్న నిజాంగూడ గ్రామస్తులు

బడికి డుమ్మా..

- జిల్లాలో విధులకు ఎగనామం పెడుతున్న ఉపాధ్యాయులు
- ఏజెన్సీ గ్రామాల్లో మరీ అధ్వానపు పరిస్థితులు
- అమలుకు నోచుకోని బయోమెట్రిక్ విధానం
- సొంత పనులకే పరిమితమవుతున్న పలువురు టీచర్లు
- ఐటీడీఏ పర్యవేక్షణ లేక ఆగమవుతున్న సర్కారీ చదువులు

ఆదిలాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి విద్యార్థులకు విద్యాబుద్దులు చెప్పాల్సిన కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు బడి విధులకు డుమ్మాకొడుతున్నారు. అడపాదడప బడికి వెళ్తూ.. సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పాఠశాలలు పునః ప్రారంభమై నెల రోజులు గడిచి పోతున్నా.. ఇప్పటి వరకు కొన్ని పాఠశాలల తలుపులు తెరుచుకోవడమే లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ప్రధానంగా మారుమూల ఏజెన్సీ గ్రామాలలో పరిస్థితులు మరీ అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా ఆదివాసీ బిడ్డలు అక్షరాలకు దూరమవుతున్నారు. విద్యార్థులను దారిలో పెట్టాల్సిన ఉపాధ్యాయులే విధులకు ఎగనామం పెడుతూ డుమ్మా కొట్టడం పరిపాటిగా మారింది. జిల్లాలో ఉన్నత పాఠశాలలు 120, ప్రాథమిక పాఠశాలలు 500, ప్రాథమికోన్నత పాఠశాలలు 119.. మొత్తం 739 ఉన్నాయి. అలాగే ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో 930 ప్రాథమిక పాఠశాలలు ఉన్న ట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ప్రతియేటా చేపడుతున్న బడిబాట కార్యక్రమంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా.. హాజరు శాతం అంతంత మాత్రంగానే కనిపిస్తుంది. ఐటీడీఏ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అడపాదడప విధులకు హాజరవుతున్నా.. అడిగే వారే కరువవుతున్నారు. ఒక వేళ విధులకు హాజరైనా.. ఇలా వచ్చి అలా వెళ్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సెలవుపై వెళ్తే బడి బందే..

మారుమూల ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఏకోపాధ్యాయులు సెలవుపై వెళ్తే బడిని మూసి వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కొన్ని పాఠశాలల్లో అందుబాటులో ఉన్న అంగన్‌వాడీ టీచర్ల చేత పాఠాలు బోధిస్తున్నారు. కొందరైతే అమాయక గిరిజన నిరుద్యోగులను మచ్చిక చేసుకుని నెలకు ఎంతో కొంత వేతనంగా ఇస్తూ బడికి డుమ్మా కొడుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్న చోట టీచర్లు వంతుల వారీగా విధులకు హాజరవుతున్నారు. ముందస్తు జాగ్రత్తగా సెలవు లెటర్లను పెట్టి మరీ వెళ్తున్నారు. ఎవరైనా అధికారి వస్తే సెలవులో ఉన్నామని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. లేకుంటే తిరిగి విధులకు హాజరైనట్లు రిజిస్ట్రర్‌లో

(తరువాయి 6వ పేజీలో...)



ఉపాధ్యాయుడు రాక విద్యార్థులు ఆగమవుతున్నారు

: మేస్రం లాల్‌షావు, విద్యా కమిటీ చైర్మన్, నిజాంగూడ, సిరికొండ మండలం



ఉపాధ్యాయుడు సక్రమంగా బడికి రాక పోవడంతో విద్యార్థులు ఆగమై పోతున్నారు. ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోవడం లేదు. డుమ్మాకొట్టే టీచర్‌ను తొలగించి మరో ఉపాధ్యాయున్ని నియమించాలి. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో ఆదివాసీ విద్యార్థులకు చదువుకోవడం కష్టంగా మారుతుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్థోమత లేదు. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యూలర్‌గా పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయున్ని నియమించాలి.

విధులకు హాజరుకాకుంటే చర్యలు తీసుకుంటాం

: అంబాజి, డీడీ, ఐటీడీఏ ఉట్నూర్

ఏజెన్సీ మారుమూల గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు విధులకు తప్పకుండా హాజరు కావాలి. లేదంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. అంతేకాకుం డా ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేసి ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలపై పర్యవేక్షణ చేస్తున్నాం. నిజాంగూడ పాఠశాల విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉపాధ్యాయుడిని నియమించే విధంగా ఏర్పాట్లు చేస్తాం.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్ చౌహాన్

గృహజ్యోతి బకాయిలు వసూలు చేయాలి : జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): డీఈ ఆదిలాబాద్, ఏడీఈతో కలిసి జైనథ్ సెక్షన్, సబ్‌స్టేషన్‌ను సీఈ /కన్‌స్ట్రక్షన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్/ఆదిలాబాద్ జేఆర్ చౌహాన్ గురువారం తనిఖీ చేశారు. అనంతరం జైనథ్ సెక్షన్ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11కేవీ ముక్తాపూర్, బెల్లూర్‌ఫీడర్స్ మీద ఎక్కువ అంతరాయాలు ఉన్నాయని, వెంటనే పీఎంఐ చేసి చెట్లు ఏమైనా ఉంటే కొమ్మలు నరికేసి అంతరాయలు తగ్గించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న స్ట్రకప్ మీటర్స్ వెంటనే మార్చాలని, గృహజ్యోతి పాత బకాయిలు వెంటనే వసూలుచేయాలని సూచించారు. వంగిన స్తంభాలను 33 కేవీ లైన్స్‌లో మాత్రమే సరి చేశారని, 11 కేవీ లైన్స్‌లో కూడా గుర్తించి అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో రాసి వెంటనే సరి చేయాలని ఆదేశించారు.


హసనాపూర్‌లో నిల్వ ఉన్న యూరియాను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

యూరియాను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు : శ్రీధర్ స్వామి

తాంసి, జూలై 10(ఆంధ్రజ్యోతి): యూరియాను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి అన్నారు. గురువారం మండలంలోని హసనాపూర్, తాంసి గ్రామాలలో పంపిణీ చేస్తున్న యూరియా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు ఎక్కడెక్కడ ఎంత నిల్వ ఉందో? వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయాల్లోని ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాంసి మండలంలో హస్నాపూర్, జామిడి, తాంసి గ్రామాలలో ఎరువులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు ఎంత నిల్వ ఉంది అనే సమాచారాన్ని రైతులకు తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిదేనని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎప్ప టికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఇందులో మం డల వ్యవసాయ శాఖ అధికారి రవీందర్, సిఈఓ కేశవ్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

జొన్నల డబ్బులు విడుదల చేయాలి

తాంసి, జూలై 10(ఆంధ్రజ్యోతి): జొన్నలు అమ్మి రెండు మాసాలు కావస్తున్నప్పటికీ ప్రభుత్వం తమ డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని? పలువులు రైతులు ప్రశ్నిస్తున్నారు. కొంతమంది రైతులకు మాత్రమే జొన్నల డబ్బులు వచ్చాయని, మిగతా రైతులకు ఎందుకు వేయడం లేదని వాపోతున్నారు. ఈ విషయంపై గురువారం కొనుగోలు చేసిన సహకార సొసైటీ సిబ్బందికి తాంసి, భీంపూర్, తలమడుగు మండలాల రైతులు వినతి పత్రం సమర్పించారు. వెంటనే డబ్బులు విడుదల చేయాలని కోరారు. డబ్బులు రాక తమకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జొన్న డబ్బులు వస్తే ఖరీఫ్ సాగుకు ఉపయోగపడుతుందని ఆశపడ్డామని విన్నవించారు.

పోలీసులమని బెదిరించి డబ్బుల వసూలు

● మోసాలకు పాల్పడిన నకిలీ పోలీసు ముఠా అరెస్టు ● నాలుగు రాష్ట్రాల్లో రూ.18 లక్షల వరకు మోసం ● మోసగించిన డబ్బులతో మేకల వ్యాపారం ● ఇచ్చోడ పోలీసు స్టేషన్లలో కేసు నమోదు, నలుగురి అరెస్టు ● వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పోలీసులమంటూ బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ ముఠాను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాల ప్రకారం.. నకిలీ పోలీసులుగా మారిన ఐదుగురు యువకులు నగల దుకాణాల యజమానులకు ఫోన్ చేస్తూ గతంలో దొంగ బంగారం కొన్నారంటూ బెదిరింపులకు దిగుతు మోసాలకు పాల్పడడంతో ఇచ్చోడ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా.. నకిలీ పోలీసు ముఠా గుట్టు రట్టయిందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలో సుమారుగా రూ.18లక్షల వరకు మోసం చేసినట్లు తెలిపారు. నిందితులు మోసగించిన డబ్బులతో మేకల వ్యాపారం చేశారని,ఆ వ్యాపారంలోను నష్టాలు రావడంతో మళ్లీ మోసాలకు పాల్పడడం ప్రారంభించారని తెలిపారు. ఈ కేసులో ఏ1 షేక్ ఇర్ఫాన్ (నల్గొండ), ఏ2 చింతలచెరువు ప్రశాంత్(నల్గొండ), ఏ3 బద్నపూరి అజయ్(నల్గొండ), ఏ4 బొప్పం సుధాకర్(నల్గొండ)ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా ఏ5 వెక్కురినరేష్(నల్గొండ) పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. వీరి వద్ద బెలోనో కారు, మరో బుల్లెట్ బైక్, ఆటో, బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాలో కేసులు ఉన్నాయని, జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు, మోసాలకు పాల్పడడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సై పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.




వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ (ఇన్‌సెట్‌లో స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

అన్ని శాఖల సమన్వయంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమిష్టి కృషితో బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలిద్దామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. గురువారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల సమన్వయంతో సమావేశంలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హోటళ్లు, ఇటుకబట్టీలు, నిర్మాణ పనులు, వ్యాపార సముదాయాలలో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించి వారిని తల్లిదండ్రులకు లేదా సంరక్షణ గృహాలకు చేర్చి యజమానులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పిల్లల బాల్యం బడులకు అంకితం కావాలని, కార్మికులుగా, కర్షకులుగా కొనసాగరాదని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 37 మంది బాలలను రక్షించి తల్లిదండ్రులకు, సంరక్షణ స్థలాలకు చేర్చడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 10 కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. బాల కార్మికులను పనిలో ఉంచుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇందులో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ పి.చంద్రశేఖర్, ఇన్స్‌పెక్టర్లు గుణవంతురావు, పద్మ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు రాజలింగు, వినోద్‌కుమార్, డీసీపీఓ రాజేంద్రప్రసాద్, చైల్డ్ లేబర్ ఆఫీస్ అధికారులు, ష్యూ ర్ ఎన్జీవో సభ్యులు, షీ టీం సభ్యులు, ఎన్జీవో సభ్యులు, తదితరులున్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న జిల్లా వైద్య అధికారి కుడ్మెత మనోహర్

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

● జిల్లా ఏజెన్సీ అదనపు వైద్య అధికారి

నార్నూర్, జులై 10(ఆంధ్రజ్యోతి): వర్షా కాలం ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త ఉండాలని జిల్లా ఏజెన్సీ అదనపు వైద్య అధికారి కుడ్మెత మనోహర్ అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ధాబా(కే) గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహించిన రాపిడ్ ఫీవర్ సర్వేను పనితీరు పరిశీలించి పలు సలహా సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అధికారులు వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. ఇందులో ఝరి వైద్యాధికారి సంజీవ్, నాందేవ్, హెచ్‌ఈవో ఆడె సంజయ్, హెచ్ ఎస్ శ్రీదేవి, సురేఖ, రత్నా, కల్పన, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నేరడిగొండ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సద్దాం అన్నారు. గురువారం మండలంలోని దర్బా తండా గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెచ్‌ఎస్ సంతోష్, హెచ్‌ఏ జగదీశ్వర్ రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, ఏఎన్ఎం సంగీత, ఆశా సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని జయప్రదం చేయండి : ఆడె

నేరడిగొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని రత్న గార్డెన్‌లో నిర్వహించే ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొంటున్న ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిలు అనిల్ కుమార్ యాదవ్ (రాజ్యసభ సభ్యులు), రఘువీర్ రెడ్డి (నల్గొండ పార్లమెంట్ సభ్యులు) పాల్గొంటున్నారు. ముఖ్య కార్యకర్తలు సమావేశంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆడే గజేందర్ కోరారు.

జిల్లాలో భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ


● ఆదిలాబాద్ పట్టణంలోని దత్త మందిరంలో మంగళ హారతులు పడుతున్న భక్తులు, మహిళలు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గురుపూర్ణిమ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం తెల్లవారు జామున నుంచి ఆయా ఆలయాల్లో భక్తుల తాకిడి నెలకొంది. గురుపౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని సాయిబాబా ఆలయాలు,దత్త మందిరంలో భక్తులు ప్రత్యేకపూజాది కార్యక్రమాలను నిర్వహించారు. గురుపౌర్ణమి ప్రాముఖ్యతను ఆలయ పంతులు వివరించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

● గోపాలకృష్ణ మఠంలో ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్ అర్బన్: గురు పౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని అతిపురాతనమైన రామచంద్ర గోపాలకృష్ణ మఠంను ఎమ్మెల్యే పాయల శంకర్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మఠాధిపతి యోగానంద సరస్వతి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే ఆసారాం బాపూజీ ఆశ్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇందులో విజయ్, మోహన్, అగర్వాల్, జోగురవి, స్వాధి, దోని జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: ఉట్నూర్ ఏజెన్సీలో గురువారం గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని సద్గురు దత్తసాయి మందిరంలో, పూలాజిబాబా ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని జైనూరు మండలం పాట్నాపూర్‌లో కొలువుదీరిన సద్గురు పూలాజిబాబా సంస్థాన్ ఆధ్వర్యంలో పూలాజి బాబా ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పాట్నాపూర్‌లోని పూలాజిబాబా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి గురుపౌర్ణమి ఉత్సవాలలో భాగస్వాములు అయ్యారు.

అలాగే, గురుపూర్ణిమ సందర్భంగా గురువారం బీజేపీ జాతీయ నాయకుల ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఇందులో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జాదవ్ సుమన్, బీజేపీ మండల అధ్యక్షుడు బింగి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బొడ్డు కిరణ్, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి శేషారావు రాథోడ్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని శబరిమాత ఆశ్రమం, దత్తాత్రి ఆలయాలలో గురువారం గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అందరు ఆలయాల్లో ముగ్గులు వేసి అలంకరణలు చేశారు. అనంతరం భక్తి పాటలు పాడి ధ్వజ రోహణ చేశారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

జైనథ్: జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ పరిధిలోని రాంపూర్ టి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదపూజ నిర్వహించారు. హెచ్‌ఎం కె.వీరకుమార్, ఉపాధ్యాయులు విఠల్, సురేష్, హేమలత, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలాగే, జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను గురువారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

తాంసి: గురు పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం మండలంలోని ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వడ్డాది, గ్రామంలో వెలసిన నరసింహ స్వామికి వందలాది మంది భక్తులు తరలివెళ్లి ప్రత్యేకత పూజలు నిర్వహించారు.

నార్నూర్: మండలకేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో గురువారం గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.గజానంద్ నాయక్, భారత్ వాగ్మరే, యునుస్ అక్బాని, ఉత్తం రాథోడ్, తదితరులు ఉన్నారు.

బోథ్: మండలకేంద్రంలోని వేదం పాఠశాలలో, సోనాల మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలను జరుపుకున్నారు. అలాగే, శబరిమాత, సాయిబాబా ఆలయాలలో గురుపూజోత్సవ వేడుకలను జరుపుకున్నారు. అంతేగాక మండలంలోని కౌటా (బి), దన్నూర్, పోచ్చెరా ఆశ్రమాలలో సైతం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో వ్యాస పౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇందులో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి రజిత, బోధన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీసరస్వతి శిశుమందిర్‌లో ప్రధానాచార్యులు మీనా గురుపూర్ణిమ విశిష్ఠతను వివరించారు.


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయల


రాంపూర్‌లో తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు


పాట్నాపూర్ పూలాజిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

బజార్‌హత్నూర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా కుటుంబాన్ని కాపాడుకోవాలని అలాగే డ్రగ్స్, సైబర్‌నేరాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని విలేజ్ పోలీసు ఆఫీసర్‌రాథోడ్ మోహన్‌సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రైమ్, షీ టీమ్స్, ఆంటీ డ్రగ్స్, పోక్సో చట్టం అలాగే డయల్ 100, తదితర అంశాలపై విస్తృత స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు జె.భూమన్న, ఉపాధ్యాయులు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అమలు తీరు పరిశీలన

బోథ్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం అమలు తీరును తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ గురువారం మధ్యాహ్నం పాఠశాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం అమలు తీరును పాఠశాల ప్రధానోపాధ్యాయులు శర్మాను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుల అరుణ్ కుమార్, స్థానిక నాయకులు గాజుల పోతన్న, రమేష్ బత్తుల, తదితరులు ఉన్నారు.

'మంత్రి సీతక్కను విమర్శిస్తే ఊరుకోం'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ బిడ్డ, రాష్ట్ర మంత్రి సీతక్కను విమర్శించే స్థాయి మాజీ ఎంపీ మాలోతు కవిత, తుల ఉమకు లేదని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. గురువారం ప్రజాసేవాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేటీఆర్ మెప్పు కోసమే ఉమ, కవిత అనవసర ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సాటి ఆడబిడ్డ అని కూడా చూడకుండా నోటికి ఎంతొస్తే అంత మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని వాటిపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మరోసారి సీతక్క పై నోరు పారేసుకుంటే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఇందులో ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సునిల్‌జాదవ్, గిమ్మ సంతోష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, సంతోష్, శ్రీలేఖ, రఫీక్, తదితరులున్నారు.

'జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి'

ఉట్నూర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భుక్య జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఖానాపూర్ మండలకేంద్రంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ మండల మాజీ అధ్యక్షుడు, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్ వద్ద జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం హామీని అమలు చేయకుండా తమ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లు ఆధారంగానే ఉద్యోగాలు కల్పిస్తున్నారని అన్నారు. ఈ జాబ్‌మేళాలో 60కంపెనీల ప్రతినిధులు హాజరు అవుతున్నందున మెజార్టీ నిరుద్యోగులు హాజరై ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరారు. పదవ తరగతి నుంచి డిగ్రీ, బిటెక్ వరకు చదువుకున్న నిరుద్యోగులు ఈ జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భరత్‌చౌహాన్, ధరణి రాజేశ్, ముజీబ్ ఖాన్, దూట మహేందర్, సిడాం సోనేరావు, సత్యం, దావుల రమేష్, సాజద్, సూర్యకాంత్ యాదవ్, కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఉధృతంగా ప్రవహిస్తున్న ఖడ్కి వాగు



గాదిగూడలో కూలి పోయిన ఇల్లు



కుంటాల జలపాతం

ఆదిలాబాద్‌లో ఎడతెరిపిలేని వర్షాలు

● అత్యధికంగా భీంపూర్‌లో 76.8 మి.మీ.ల వర్షపాతం ● గాదిగూడలో కూలిన ఇళ్లు ● ఏజెన్సీలో పొంగి ప్రవహిస్తున్న వాగులు

ఆదిలాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి)/నార్నూర్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షా లు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏక ధాటిగా ఓ మోస్తారు వర్షం కురుస్తునే ఉంది. జిల్లా సగటు వర్షపాతం 11.9 మి.మీ.లు కాగా అధికంగా 33.1 మి.మీ.ల వర్షం కురిసింది. అలాగే అత్యధికంగా బీంపూర్ మండలంలో 76.8, జైనథ్‌లో 76.1, సాత్నాలలో 68.3, ఇంద్ర వెల్లిలో 52.1, బోరజ్‌లో 51.0, నార్నూర్‌లో 47.4, బేలలో 45.4, ఆదిలాబాద్‌అర్బన్‌లో 38.5 మి.మీల వర్షం కురిసింది. అత్యల్పంగా ఇచ్చోడలో 9.4 మి.మీ ల వర్షపాతం నమోదైంది. గత నాలుగైదు రోజులుగా ఏకదాటిగా కురుస్తు న్న వర్షాలకు చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతుం ది. జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నదికి వరద ఉధృతి పెరిగింది. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. గాదిగూడ మండలంలో కురిసిన భారీ వర్షానికి వేలాది భీమ్‌రావ్ ఇళ్లు కూలి నేలమట్టమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రాణనష్టం తప్పింది. అలాగే ఖడ్కి వాగు ఉప్పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. ప్రధానంగా చెప్పుకునే సాత్నాల ప్రాజెక్టు నీటి మట్టం 286.50 మీటర్లకు చేరుకుంది. అలాగే మత్తడి వాగు నీటి మట్టం 276.20 మీటర్లకు చేరింది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ఏక్షణంలోనైనా వరద గేట్లను ఎత్తే అవకాశం కనిపిస్తుంది. నది దిగువ పరివాహక ప్రాంతంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తారు.

● కుంటాలకు జల సోయగం

నేరడిగొండ: మండలంలో ఉదయం నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తుండడంతో ఆయా గ్రామాలల్లో గల వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఎగువ ప్రాంతంలో వాన కురవడంతో కుంటాల జలపాతానికి పెద్దమొత్తంలో వరదనీరు పోటెత్తుతోంది.

'తులం బంగారం హామీ ఏమైంది?'

గుడిహత్నూర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కల్యాణాలక్ష్మి పథకం ద్వారా ఆడపడుచుల వివాహానికి ఇస్తామన్న తులం బంగారం హామీ ఏమైందని? బోథ్ ఎమ్మెల్యే అనీల్ జాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన 15 మంది లబ్దిదారులకు మంజూరైన కల్యాణాలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలను ఆదుకునేందుకు కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ఎంతో మందికి ఆసరాగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు కల్యాణాలక్ష్మి సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటించి అమలు చేయలేదన్నారు. ప్రజలకు మోసపూరిత హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కవిత రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్ గౌడ్, నాయకులు జాదవ్ రమేష్, షేక్ జమీర్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: గురువులు మనకు మార్గదర్శని చూపిస్తారన్నారు. వారు చెప్పిన మార్గంలోనే నడుచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్ జాధవ్ గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూజ అనంతరం ఎమ్మెల్యే ఆలయ సభ్యులు భక్తులు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ గురు పూర్ణిమ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకయ్య, మాజీ సర్పంచ్ సాకే ఆనంద్ టిఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర రెడ్డి, అభిరామిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మొట్టే కిరణ్ కుమార్, లక్ష్మారెడ్డి, లింగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరడిగొండ: గురు పౌర్ణిమ సందర్భంగా బంజారా కాశీ అయిన పౌరదేవి జగదంబ మాతా, జగత్ గురు సేవాలాల్ మహరాజ్ సంత్ శ్రీ రామారావు మహరాజ్ ఆలయాలను గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శేఖర్ మహరాజ్, కబీర్ దాస్ మహరాజ్, ధర్మగురు బాబుసింగ్ మహరాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. అయన వెంట నియోజకవర్గ నాయకులు, తదితరులు ఉన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

సిరికొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం మండలంలోని రాయిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో సునీల్ తెలిపారు. గురువారం ఆయన ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు సంబంధించిన గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చదువు మధ్యలో మానేసిన వారు పదవ తరగతికి దరఖాస్తు చేసుకోవచ్చని, పదవతరగతి పాస్ అయిన వారు ఇంటర్ ఒక సంవత్సరంలో పూర్తి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. టెన్త్ ఫెయిలైన విద్యార్థులు, ఆర్థిక పరిస్థితి బాగాలేక, ఇతర కారణాలతో చదువు మానేసి పనులు చేసుకుంటూ జీవిస్తున్న 14 ఏళ్ల పైబడిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. ఇందుకు కనీసం ఐదవ తరగతి వరకు చదివి ఉండాలని ఆయన పేర్కొన్నారు. పదవ తరగతి అడ్మిషన్స్ కోసం ఇంతకీ ముందు పాఠశాలలో చదివిన రికార్డ్ షీట్, ఆధార్ కార్డు కుల ధృవీకరణ పత్రం, ఇంటర్ అడ్మిషన్ల కోసం పదవ తరగతి టీసీ, పదవ తరగతి మేమో కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఫోటోతో రాయిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వచ్చే నెల ఆగస్టు 12వతేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు రాయిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

బోథ్, జూలై 10(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని సాకేర గ్రామంలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కలలను నిజం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరా మహిళ నిర్మాణం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆయన వెంట సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్, బత్తుల సీనియర్ నాయకులు గాజుల పోతన్న, పిఎసిఎస్ డైరెక్టర్ ఎల్పొసెట్టి, బీసీ సెల్ నాయకులు జంగాల భోజన్న, మాజీ సర్పంచ్ వినోద్, రామ్ చందర్, ఆకాజిద్, హరి, తదితరులు ఉన్నారు.

బడికి డుమ్మా!

(5వ పేజీ తరువాయి...)

సంతకాలు చేసుకుంటున్నారు. ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో ఎక్కువ పాఠశాలలు మూసే ఉంటున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. కొందరు ఉపాధ్యాయులు మాత్రం వారానికోసారి పాఠశాలలకు వెళ్తూ సంతకాలు చేసుకుంటూ వేతనం పొందుతున్నట్లు తెలుస్తుంది.

బయోమెట్రిక్‌కు ఆటంకాలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధంగా ప్రభుత్వం బయోమెట్రిక్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. మొదట ఈ విధానం ద్వారా ఉపాధ్యాయుల హాజరు శాతం కొంత మెరుగ్గానే కనిపించినా.. ఆ తర్వాత బయోమెట్రిక్ విధానం అమలుకు నోచుకోవడం లేదని తెలుస్తుంది. ఇప్పటికే బయోమెట్రిక్ మిషన్లు మరమ్మతులకు నోచుకోక పోవడంతో మూలనపడి కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల సిగ్నల్ ఇబ్బందులతో బయోమెట్రిక్ విధానం పని చేయడం లేదంటున్నారు. జిల్లాలో అడుగడుగునా ఆటంకాలే ఏర్పడడంతో బయోమెట్రిక్ విధానంపై అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో కొందరు ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నట్లు తెలుస్తుంది. ఒకవేళ వెళ్లినా.. మధ్యాహ్నం వరకు కాలయాపన చేస్తూ తిరుగుముఖం పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

బడిపై నిండు నిర్లక్ష్యం

ఏజెన్సీ మారుమూల ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న కొందరు ఉపాధ్యాయులు సర్కారు బడిపై నిండు నిర్లక్ష్యాన్ని చూపుతున్నారు. అడపాదడప విధులకు హాజరవుతూ సొంత పనులకే పరిమితమవుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులతో పాటు రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, పైరవీలు, సంఘాల పేరుతో విధులకు హాజరు కావడం లేదని తెలుస్తుంది. తమకున్న పరపతి, పలుకుబడి తో ఉన్నతాధికారులను సైతం బుట్టలో వేసుకుంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో బడికి వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు లేవన్న సాకుతో బడికి దూరమవుతున్నారు. వర్షం కురిస్తే చాలు ఇంటికే పరిమితమవుతున్నారు. ఏజెన్సీ పాఠశాల లపై ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుందంటున్నారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో తప్పించుకుంటూ తిరుగుతున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

తాంసి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న మత్తడి వాగు ప్రాజెక్టులో మంగళవారం చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు గల్లంతైన విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి నుంచి గాలిపు చర్యలు చేపట్టగా బుధవారం మధ్యాహ్నం యువకుడి మృతదేహం లభించినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి రఘు(25)గా గుర్తించారు. జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు చేపల వేటకు అని మంగళవారం ప్రాజెక్టుల్లోకి వెళ్లారు. అయితే ఇద్దరిలో రఘు అనే వ్యక్తి గల్లంతయ్యాడు. చివరకు ఆయన మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాంసి పోలీసులు పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

నేరడిగొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగట్ల గ్రామానికి చెందిన శతకాధిక వృద్ధురాలు సాబ్లే గొరియ బాయి(115) బుధవారం తన స్వగృహంలో మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. గ్రామస్థులు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

ఆవుకు ఘనంగా అంత్యక్రియలు

బజార్‌హత్నూర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయానికి విరాళంగా అందించిన ఆవు గురువారం కన్నుమూయగా గ్రామస్థులంతా కలిసి ఆవు అంత్యక్రియలను ఘనంగా చేశారు. గత 20 క్రితం సబ్సిడీ పుష్పలత, నందుకుమార్ కుటుంబీకులు శివాలయానికి ఆవును విరాళంగా అందించారు. ఆవు 16 దూడలకు జన్మనిచ్చిందని, దూప, దీప, నైవేద్యాలతో ఆలయానికి ఆదాయాన్ని సమకూర్చిందని ఆలయ నిర్వాహకులు వివరించారు. కాగా, గ్రామస్థులు ఆవు అంత్యక్రియలను డప్పు వాయిద్యాల మధ్య నిర్వహించారు.



మంత్రిని కలిసిన టీజేఎస్ నాయకులు

సమస్యలను పరిష్కరించండి

● మంత్రి వివేక్‌కు ముథోల్ టీజేఎస్ నాయకుల వినతి

ముథోల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గనులు, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్‌కు గురువారం టీజేఎస్ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజకవర్గంలో నెలకొన్న వివిధ సమస్యలను వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాసర కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ సర్పంచ్ ఎం. రమేష్, నాయకులు అనిల్, బసంత్ కుమార్ పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ముథోల్, జూలై10(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (బిద్రెల్లి)లో యూరియా గ్రోమోర్, 20:20:0:13 పోటాష్ అందుబాటులో ఉన్నట్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు తీసుకొని సంఘం సంప్రదించగలరని కోరారు.

పోగొట్టుకున్న పర్సు బాధితురాలికి అప్పగింత

కుబీర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన దొంతుల దత్తాత్రి (టేల) నిజాయితీ చాటుకున్నాడు. మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన బోయిడి తిరుమల అనే మహిళ తన పర్సును బస్టాండ్‌లో మరిచిపోయింది. ఆ వైపు నుంచి వెళ్తున్న దత్తాత్రి గమనించి ఆ పర్సును బుధవారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. వివరాల కోసం పర్సును విప్పిచూడగా రూ.22416 నగదు, కాళ్ల పట్టీలు, ఆధార్‌కార్డు లభించాయి. ఆధార్‌కార్డు ఆధారంగా బాధితురాలిని పిలిచి గురువారం నిర్మల్ జిల్లా ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి సంబంధిత మహిళకు అందించారు. నిజాయితీ చాటుకున్న దత్తాత్రిని శాలువతో సన్మానించి అభినందించారు.

దొంతనం కేసు ఛేదించిన పట్టణ పోలీసులు

నిర్మల్ రూరల్, జూలై10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోహన్ ఎలక్ట్రానిక్ గోదాంలో జరిగిన దొంగతనాన్ని పోలీసులు ఛేదించి దొంగతనానికి గురైన వస్తువులను రికవరీ చేసినట్లు రూరల్ సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మున్నూరు కృష్ణ మాట్లాడుతూ కొన్నిరోజులుగా గోదాంలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కనిపించకుండా పోవడాన్ని గుర్తించిన షాపు యజమాని వెంకట రమణ తన తరఫున ఆడిట్ నిర్వహించి, అనుమానాస్పదంగా పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులపై ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారణ చేపట్టి దర్యాప్తులో భాగంగా అనుమానితులుగా ఉన్న నవత్ శ్రీకాంత్, జిందాడే సచిన్, సాబ్లే జగదీశ్వర్, కుసులే నవీన్‌లను విచారించారు. సీసీ కెమెరాలు లేనందున తమ చర్యలు బహిర్గతం కాకుండా గమనించిన వారు ఫ్రిడ్జ్, ఆరు కూలర్లు, గీజర్, సామ్‌సంగ్ టీవీ వస్తువులను దొంగతనం చేసినట్లు వారు ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. వీటిని తరలించేందుకు ఆటోడ్రైవర్ అయిన సయ్యద్ ఇమ్రాన్ సహాయం తీసుకున్నారని విచారణలో తేలింది. ఈ కేసును వేగంగా ఛేదించిన దర్యాప్తు అధికారి ఎస్సై కే.సంజీవ్‌కుమార్, సీఐ మున్నూరు కృష్ణని ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్, సబ్ డివిజన్ ఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు

కన్నుల పండువగా గురుపౌర్ణమి వేడుకలు

భైంసా,జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాగుబాయి గుట్ట సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు కన్నుల పండువగా కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో పౌర్ణమి వేడుకల్లో పాల్గొని సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉదయం వేళ నుంచి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జాము వేళలో సాయిబాబా విగ్రహానికి అభిషేకం నిర్వహించి శోభయామనంగా అలంకరించారు. అనంతరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సాయి సచ్చరిత పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు పారాయణంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం వేళలో ప్రత్యేక హరతి నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం వేళలో పల్లకి సేవ, రాత్రి వేళలో సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.



ఆలయంలో సాయిబాబా విగ్రహం



భైంసా సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్, భక్తులు

ఘనంగా రమేష్ రెడ్డి వర్ధంతి

దిలావర్‌పూర్, జూలై10 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత, మాజీ డీసీసీబీ చైర్మన్ పొద్దుటూరి రమేష్‌రెడ్డి వర్ధంతిని గురువారం నిర్వ హించారు. రమేష్‌రెడ్డి విగ్రహానికి గ్రామస్థులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, దిలావర్‌పూర్ మాజీ జడ్పీటీసీ గంగారెడ్డి, ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ వీరేష్ కుమార్, నర్సారెడ్డి, షఫీ, మాజీ ఎంపీపీ అనిల్, సుధాకర్, ఎస్. భోజారాం, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

తానూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామారావుపటిల్ శుక్రవారం మండలానికి రానున్నట్లు గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బోసి గ్రామంలో ఉదయం 11గంటలకు బాలవికాస్‌లో ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



ఆలయ నిర్మాణానికి భూమిపూజ

భైంసారూరల్, జూలై10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామోల్‌లో రూ.12 లక్షల నిధులతో నిర్మించనున్న పెద్దతల్లి ఆలయానికి ఎమ్మెల్యే రామారావు పటేల్ శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశల వారీగా ఆలయాన్ని అభివృద్ధి పరచనున్నట్లు తెలిపారు. కామోల్, కుంసర గ్రామాల మధ్యలో ఆలయం నిర్మించడంతో భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. గ్రామపెద్దలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాసర సరస్వతీ క్షేత్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

● మంత్రులు కొండా సురేఖ, సీతక్కలను కలిసిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా/ముథోల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ సరస్వతి అమ్మవారి క్షేత్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి రాష్ట్రమంత్రులు కొండాసురేఖ, సీతక్కలకు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి బాసర అమ్మవారి క్షేత్ర సమస్యలు, అవసరమైన అభివృద్ధి పనుల విషయం మాట్లాడారు. గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో అమ్మవారి క్షేత్రంలో అవసరమైన ప్రగతి పనుల కోసం విరివిగా నిధుల కేటాయించాలని కోరారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లోనున్న రూ.42 కోట్ల నిధులను త్వరితగతిన విడుదల చేయాలన్నారు. అంతేకాకుండా దేవదాయశాఖకు సంబంధించి డిప్యూటీ ఇంజనీర్ పోస్టు ఖాళీగానున్న దృష్టా పనుల నిర్వహణ, బిల్లుల నమోదు తదితర విషయాలలో సమస్యలు ఏర్పడుతున్నాయని వివరించారు. నియోజక వర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పెండింగ్ దశలోనున్న వాటిని క్లియర్ చేయాలని విజ్ఞప్తిచేశారు. అక్కడి సమస్యల పరిష్కారానికి, అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు సంబంధిత శాఖకు సంబంధించి పెండింగ్‌లోనున్న వివిధ ప్రాంతాల పనులతోపాటు ఆయా గ్రామాల్లోని సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.



మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందచేస్తున్న విఠల్‌రెడ్డి



మంత్రి సీతక్కను కలిసిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



గురువును సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా గురుపూజోత్సవం

ముథోల్, జూలై10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల, రబింద్రా ఉన్నత పాఠశాల, అక్షర పాఠశాలలతోపాటు మండలంలోని ఫ్యూచర్ స్కూల్, శ్రీవిద్య, భాష్యం, ప్రభుత్వ పాఠశాలలో గురువారం వ్యాసపౌర్ణమి (గురు పౌర్ణమి) సందర్భంగా గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పి బతుకు బాటకు మార్గనిర్దేశం చూపిన గురువులకు పాదాభివందనం చేసి సన్మానించారు. ఇతిహాస, పురాణాలలో మన హిందూసాంస్కృతి, సాంప్రదాయాలలో గురువుకు గొప్ప స్థానం ఉందని, గురువు శిష్యునిలోని అంధకారాన్ని తొలగించి వెలుగులు నింపుతాడని, గురువే లేకపోతే విశ్వమంతా చీకటై ఉండేదనిన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రోజు ప్రారంభమైన ఓంసాయి శ్రీసాయి జయ జయ సాయి సాయినామస్మరణ గురువారంతో ముగిసింది. స్థానిక ప్రభాకర్ మహారాజ్ మందిరంలో ఆయన విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. సాయిబాబాకు అభిషేకం, అర్చన, మధ్యాహ్న హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు

నిర్మల్‌రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని చిట్యాల్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గురు పౌర్ణమి సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు వెంకట రమణ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భాజపా నాయకులు, నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి. సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ మహాకవి వేద వ్యాసుడు భారతదేశానికి నాలుగు వేదాలు రుగ్వేదం, యజుర్వేదం, సామ వేదం, అధర్వణవేదం అందించి భారత దేశ గొప్పతనాన్ని చాటారన్నారు. హైందవ సంప్రదాయంలో వేదాలతో పాటు మహాభారత, మహాభాగవతం, అష్టదశ పురాణాలు రచించిన మహాయోగి అని వేద్యవ్యాసుడి గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి పవన్ ద్వివేదిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాజీ సర్పంచ్ అనిల్, రాజేశ్వర్, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, నాయకులు వాసురెడ్డి, కొట్ల నర్సారెడ్డి, రమణ గౌడ్, రమేష్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండల కేంద్రంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా పట్టణంలోని శ్రీ వీరాంజనేయ శివసాయి సమాజ్ ఆలయ ప్రాంగణంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ కోశాధికారి కట్కం శేఖరయ్య, బాధ్యులు శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఖానాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ గుగ్లావత్ వాల్ సింగ్, తదితరులున్నారు.



ఆలయంలో జాన్సన్ నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం


ప్రభుత్వ జూనియర్ కళాశాల


పూర్తికాని మరుగుదొడ్లు


ప్రస్తుతం కళాశాల మొత్తం వాడుకలో ఉన్న ఒకే ఒక్క మరుగుదొడ్డి


బిల్డింగ్ నుంచి పై పెచ్చులు ఊడుతున్న దృశ్యం


పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో గొర్రెలు మేస్తున్న దృశ్యం


పాత భవనం

చదువుల నిలయం.. సమస్యల వలయం

● ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతుల కరువు ● పట్టించుకోని పాలకులు, అధికారులు

ముథోల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపుతున్నాయని పదే పదే ప్రచారం చేస్తున్నారు. గ్రామీణ, పట్టణ పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సైతం విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని అధికారులు సైతం చెబుతున్నారు. కానీ నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 192 మంది బాలురు, 98 మంది బాలికలు, ద్వితీయ సంవత్సరంలో 233 మంది బాలురు, 95 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. అంటే మొత్తం 618 మంది ఈ కళాశాలలో చదువుకుంటున్నారు. అయితే ఈ కళాశాలలో ఒకే మరుగుదొడ్డి ఉండడంతో అది సరిపోవడం లేదు. 2024 సంవత్సరంలో ఇంటర్మీడియట్ బోర్డ్ నిధుల నుంచి సుమారు 4 యూనిట్లకు గాను రూ. 18 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. సంబంధిత గుత్తేదారుకు డబ్బులు రాకపోవడంతో అవిపూర్తి కాలేదు. దీంతో విద్యార్థులకు, అధ్యాపకులకు ఒకే మరుగుదొడ్డి ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా ఈ కళాశాలలో ఉన్న వాటర్ ప్లాంట్ కూడా సుమారు ఐదు సంవత్సరాల నుంచి పనిచేయక పోవడంతో విద్యార్థులకు అధ్యాపకులే నీళ్ల ప్రతీరోజు తెప్పిస్తున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. అలాగే విద్యార్థులకు సరిపడు తరగతి గదులు లేవు. పాత భవనంలో ఒకేషనల్ నాలుగు గ్రూపులు అలాగే ఉర్దూ మీడియం హెచ్‌ఈసీ గ్రూప్ విద్యార్థులు మొత్తం 250 విద్యార్థులు పాత బిల్డింగ్‌లో కూర్చోగా మిగతా విద్యార్థులు కొత్త బిల్డింగ్‌లో కూర్చుంటారు. అయితే పాత బిల్డింగ్‌పై పెచ్చులు ఊడిపోయి వర్షపునీరు జలిస్తుంది. అంతేకాకుండా ప్రిన్సిపాల్ కార్యాలయం, స్టాఫ్ రూమ్ కూడా సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇంతే కాకుండా కళాశాల చుట్టూ ఉన్న ప్రహరీ పూర్తిస్థాయిలో లేకపోవడంతో పశువులు ఆ ప్రాంతమంతా తిరిగి నాటిన మొక్కలు సైతం తినేస్తున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఈ పాఠశాలలో, కళాశాలలో సరిపడు ఫ్యాన్లు, లైట్ సౌకర్యం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు ఇస్తూ విద్యార్థికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకల సౌకర్యాలు కల్పిస్తుందని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఈ ముథోల్ జూనియర్ కళాశాలలో మాత్రం సమస్యలు తాండవం చేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కళాశాలలో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేయాలని విద్యార్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ కుమార్‌కు ఫోన్ ద్వారా వివరణ కోరగా కళాశాలలో శిథిలావస్థలో ఉన్న గదుల గురించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. అలాగే మరుగుదొడ్ల సమస్య ఉందని సంబంధిత కాంట్రాక్టర్‌కు డబ్బులు రాకపోవడంతో ఆ నిర్మాణాలు పూర్తి కాలేవన్నారు. ఇక్కడి విషయాలను వెను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

భక్తి


సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కన్నుల పండువగా గురు పౌర్ణమి వేడుకలు


పూజలు చేస్తున్న భక్తులు

నిర్మల్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గురు పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువు దీరిన సాయిబాబా ఆలయంలో ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకున్నారు. గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి, నాయకులు రామ్‌రెడ్డి, వెంకట్రాం రెడ్డి, ఆలయ చైర్మన్ బురాజ్, సాయి దీక్ష సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, నారాయణ రెడ్డి, లింగారెడ్డి, సుదర్శన్, జిందం గోవర్ధన్, సుదర్శన్ మాస్టర్, మూర్తి మాస్టర్, కందుల పండరి, కోల శంకర్, శ్రీనివాస్, జొన్నల మనోహర్, మహేందర్ యాదవ్, లక్ష్మణ్, తిరుపతి, తదితరులతో పాటు ఆలయ ఈవో రమేష్ పాల్గొన్నారు.

భైంసాలో


భైంసా సాయిబాబా ఆలయంలో..

భైంసా: పట్టణంలోని బాగుబాయి గుట్ట సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు కన్నుల పండువగా కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో పౌర్ణమి వేడుకల్లో పాల్గొని సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉదయం వేళ నుంచి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

బ్రహ్మేశ్వరాలయంలో..

● పాల్గొన్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్


బ్రహ్మేశ్వర స్వామివారికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే


లోకేశ్వరం: ప్రసిద్ధి పుణ్యక్షేత్రాల్లో ఒకటైన బ్రహ్మేశ్వరాలయంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా బ్రహ్మేశ్వర స్వామి వారిని దర్శించుకొని పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గురు పౌర్ణమి విశిష్టత గురించి తెలిపారు. ప్రతీఒక్కరు గురువులను గౌరవించాలన్నారు. గురువుల వల్లే మనకు జ్ఞానం లభిస్తుందన్నారు. గురువు లేకుంటే అంతా అంధకారమేనన్నారు. అలాగే బ్రహ్మేశ్వరాలయ అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు సాయిబాబా ఆలయంలో..

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రోజు ప్రారంభమైన ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి సాయి నామస్మరణ గురువారంతో ముగిసింది. స్థానిక ప్రభాకర్ మహారాజ్ మందిరంలో ఆయన విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. సాయిబాబాకు అభిషేకం, అర్చన, మధ్యాహ్న హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్న హారతి సమయంలో ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.


సాయిబాబాకు హారతి ఇస్తున్న భక్తులు


నాగాపూర్ శివసాగర్ ప్రాజెక్టు మత్తడి దూకుతున్న వరద నీళ్లు


ఉట్నూర్ మండలంలో వాగుల్లో కలుస్తున్న వరద నీరు

కురుస్తున్న వర్షాలు.. ఆందోళన చెందుతున్న రైతులు

● శివసాగర్ నాగపూర్ ప్రాజెక్టు మత్తడి దూకుతున్న నీళ్లు
● ఇంద్రవెల్లి మండలంలో అత్యధిక వర్షపాతం నమోదు


శ్యామ్‌పూర్ సుంగుగూడ ప్రాంతంలో పంట చేలలో నిలిచిన వర్షపు నీరు

ఉట్నూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు పత్తి పండిస్తున్న అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గురువారం ఉట్నూర్ ఏజెన్సీలోని ఇంద్రవెల్లి మండలంలో అత్యధిక వర్షపాతం నమోదు కాగా గాదిగూడ మండలంలో స్వల్ప వర్షపాతం నమోదు అయింది. ఇంద్రవెల్లి మండలంలోని 58.2 మి.మీల వర్షపాతం నమోదు కాగా నార్నూర్ మండలంలో 47.4 మి.మీ.లు, ఉట్నూర్ మండలంలో 35.44, గాదిగూడ మండలంలో 17.4 మి.మీల వర్షపాతం నమోదు అయింది. ఉట్నూర్ మండలంలోని నాగపూర్ శివసాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండి పోవడంతో మత్తడిపై నుంచి నీరు పారుతుంది. మండలంలోని షాంపూర్ వాగు, పులి మడుగు వాగు, నాగపూర్ వాగు, గంగాపూర్ వాగు, నర్సాపూర్ వాగు, వంకతుమ్మ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. షాంపూర్ సుంగు గూడ మధ్య ఉన్న పంట చేలల్లో వర్షపు నీరు నిలబడి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి పండిస్తున్న రైతులు వర్షం ఇలాగే ఉంటే పత్తి పంట మొక్కలకు వర్షపు నీరు తగిలి పత్తి మొక్కలు చనిపోతాయని రైతులు పేర్కొంటున్నారు. పాఠశాలలకు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వర్షం కురుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఏకదాటిగా కురుస్తున్న వర్షాలతో వ్యాపారాలు కొనసాగడం లేదని వ్యాపారులు అంటున్నారు.


కురుస్తున్న వర్షాలకు నిండిన నాగాపూర్ శివసాగర్ చెరువు

ఉపాధి పనుల్లో మహిళలే అధికం

● పనుల్లో పురుషుల కంటే ఎక్కువ మహిళలు హాజరు



ఉపాధి పనులు నిర్వహిస్తున్న మహిళా కూలీలు

భైంసా, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో మహిళల భాగస్వామ్యం అధికమవుతోంది. పురుషులతో సమానంగా పార, గడ్డపార, తట్టతో పనులు చేస్తూ జిల్లా మహిళా కూలీలు ఆదర్శంగా నిలుస్తున్నారు. పనిదినాలతో పాటు వేతనాల్లో మహిళలే అగ్రపథంలో నిలుస్తున్నారు. పనిదినాలను వినియోగించుకోవడంలో పురుషుల కంటే అతివలు ముందున్నారు. చేతినిండా పని దొరకడంతో ఉపాధి పొందుతూ ఆర్థిక పురోభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం పనుల నిర్వాహణలో పురుషుల కంటే మహిళా కూలీలే అధికంగా ఉంటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో మొత్తం కూలీలు 1.90, 400 ఉండగా ఇందులో మహిళలు 1,01,127, పురుషులు 82,673 మంది ఏపాక పురుషులు ఉన్నారు. సంబంధిత ఆర్థిక సంవత్సరంలో పురుషుల పనిదినాలు 23, 49,80 ఉండగా మహిళల పని దినాలు 33,50,920 రోజులు ఉన్నాయి. ఇక ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో కూలీలు 1,33, 000 మంది ఉన్నారు. వీరిలో మహిళా కూలీలు 77,629 మంది,పురుషులు 55,371 మంది ఉన్నారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు పురుషులు 9,25,627 రోజులు పనులు చేయగా మహిళా కూలీలు 14,05,372 రోజులు పనులు చేశారు. వేసవి సెలవుల్లో చదువుకునే యువత కూడా చురుకుగా పనుల్లో పాల్గొన్నారు. తమ కాళ్లపై తాము నిలబడటంతో పాటు కుటుంబ అవసరాలకు పురుషులతో పాటు తాము కూడా ఆర్థిక సహకారం అందించడంతో ఎంతో సంతృప్తిని ఇస్తుందని మహిళా కూలీలు చెబుతున్నారు. జిల్లాలో పని దినాల్లో అగ్రపథంలో నిలుస్తున్న మహిళా కూలీలు వేతనాలు పొందే విషయంలో పురుషుల కంటే ఆధిక్యతలో నిలుస్తున్నారు.

● ప్రధాన భాగస్వామ్యం

ఉపాధి హామీ తొలినాళ్లలో చెరువులు, కాలువ పూడికతీతలో అధికంగా పురుషులే పనులు చేసేది. నైపుణ్యం లేని కూలీలకు చేతి నిండా పని దొరకడంతో క్రమంగా మహిళా కూలీల శాతం పెరిగింది. వ్యవసాయ పనుల కంటే ఉపాధి హామీ పనులకే మహిళలు ప్రాధాన్యం ఇస్తున్నారు. పార, పలుగు పట్టి మట్టిని తవ్వుతున్నారు. నేల స్వభావం ఏదైనా ఉత్సాహంగా పనులు చేస్తున్నారు. చెరువులు, కాలువ పూడికతీత, మట్టి రహదారుల నిర్మాణంలో భాగస్వామ్యుల మవుతున్నారు. చాలా చోట్ల పనులు పర్యవేక్షించే మేట్ల బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కంటెనే అమ్మ అని అంటే ఎలా..?!



తన కన్న బిడ్డ కాకపోయిన అమ్మ ప్రేమనుపంచే గుణం పశువుల్లోను ఉంటుందని ఈ దృశ్యాన్ని చూస్తుంటే తెలిసి పోతుంది. వైరుధ్యాన్ని మరిచి అమ్మ ప్రేమతో పాలిచ్చి లాలించడం మూగజీవాల్లోను కనిపిస్తుంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గురువారం ఓ గేదె ఆవు దూడకు పాలిస్తూ కనిపించడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిని చూసిన వారంతా కంటేనే "అమ్మ" అంటే ఎలా అని చర్చించుకోవడం కనిపించింది. తన దూడతో పాటు లేగదూడకు పాలిచ్చే దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

● (ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి)

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం తేది: 19-07-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం.5-7-100/5, 1 వ అంతస్తు,అప్పలనర్సయ్య కాంప్లెక్స్, నిర్మల్ - 504106

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
NIRMLPJ2501040017	MOHAMMAD JAHEER	NIRMLPJ2501180017	CHINNA LAXMI KORRI
NIRMLPJ2501070015	SHAMSODH SYED	NIRMLPJ2501180007	RESHMA BEGUM
NIRMLPJ2501070005	RIZWANA BEGUM	NIRMLPJ2410180003	CHITTI UMA
NIRMLPJ2501080009	RYAPANI BABU	NIRMLPJ2501270015	KUNA LAXMI
NIRMLPJ2501090017	KANCHU SHYAMALA	NIRMLPJ2501270007	GANGADHER PASULA
NIRMLPJ2501150005	RYAPANI BABU	NIRMLPJ2501280007	VALLAMPATLA RANJEETH KUMAR
NIRMLPJ2501170013	ANWAR UDDIN		
NIRMLPJ2501180022	SURESH NAKIDI	NIRMLPJ2501300001	BHEEMDAS JANGILI

వేలం తేది: 19-07-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 3-1-92/18, 1 వ అంతస్తు,నిజామాబాద్ రోడ్,ఆర్మూర్ జిల్లా,నిజామాబాద్-503224,తెలంగాణ

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
ARMOOPJ2501070002	YEDLA SUGUNA	BHGALPJ2501240004	PALLAPU RAMACHANDRAIAH
BHGALPJ2501100004	KARROLLA CHANDRA	BHGALPJ2501240005	PALLAPU RAMACHANDRAIAH
BHGALPJ2501180004	RAGI NARENDHAR	ARMOOPJ2501280002	MUDA POSHANI
BHGALPJ2501180009	NARABOINA SUMALATHA	ARMOOPJ2501290002	BOMMAGANI BALAIAH
ARMOOPJ2501220001	KUDUKALA SRUJAN KUMAR	BHGALPJ2501290004	KURA VENKATESH

వేలం తేది: 19-07-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 1-5-79/48/1, 1 వ అంతస్తు,మహాలక్ష్మి జ్యువెలరి మార్కెట్ ఎదురుగా,పాత పోస్టాఫీసు,భైంసా,ఆదిలాబాద్ జిల్లా-503103,

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
ADILDPJ2501250011	SYED IMTIYAZ ALI		

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ యం.అశోక్ కుమార్** సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటి రోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబందించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 11.07.2025
స్థలం: నిజామాబాద్

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

CLASSIFIEDS

కావలెను

★ మంచిర్యాలలో హాస్పిటల్ నందు పని చేయుటకు ఆయాలు, నర్సులు, కంపౌండర్‌లు, ఎక్స్‌రే టెక్నీషియన్ కావలెను. ఆసక్తి కలవారు సంప్రదించగలరు. సెల్: 7036555577
AJK-238283

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు... క్లాసిఫైడ్స్
ప్రతి 4 లైన్లకు 175/- అదనపు లైన్‌కు రూ.45/- GST 5% Extra



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
ఆదిలాబాద్ : 99854 11291, నిర్మల్ : 80966 77672

వ్యాధుల విజృంభణ!

- జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు • ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- పల్లెల్లో పడకేస్తున్న పారిశుధ్యం • అందిన కాడికి దండుకుంటున్న ప్రైవేట్ ఆసుపత్రులు • నకిలీ వైద్యులపై వైద్య, ఆరోగ్య శాఖ నిఘా
- జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన • ఈగలు, దోమల వ్యాప్తి నివారణకు వారానికి రెండుసార్లు డ్రైడే

ఖానాపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడం.. పారిశుధ్య చర్యలు అస్తవ్యస్తంగా మారడంతో జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజలు వ్యాధుల బారిన పడుతూ మంచం పడుతున్నారు. దగ్గు, జలుబు, కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు లాంటి వ్యాధుల బారిన పడి సతమతమవుతూ ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అరకొర సౌకర్యాల నేపథ్యంలో జనం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఏ గ్రామంలో చూసినా ప్రజలను విష జ్వరాలు పీడిస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

భయపెడుతున్న డెంగీ, మలేరియా

పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలపై దాడి చేస్తున్నాయి. జిల్లా ప్రజలను సీజనల్ వ్యాధుల బారిన పడేలా చేస్తున్నాయంటున్నారు. ఈ వర్షాకాలం ఆరంభమైన నాటి నుంచి మలేరియా, డెంగీ లాంటి ప్రజలను వెంటాడుతున్నాయి. సీజనల్ వ్యాధుల బారిన పడిన వారికి టైఫాయిడ్ పాజిటివ్ వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన వైద్య శాఖ అధికారులు మాత్రం తమ పనిని తూతూ మంత్రంగా ముగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రోగులకు అక్కడి వైద్యులు పలు రకాల రక్త పరీక్షలు చేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో సామాన్యుడి జేబుకు చిల్లుపడి అప్పులపాలు అవ్వాల్సిన పరిస్థితి వస్తోందని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పలువురు వైరల్ జ్వరాలు, వ్యాధుల బారిన పడటానికి వాతావరణంలో వస్తున్న మార్పులే కారణమని వైద్యులు చెబుతున్నారు. పరిసరాల పరిశుభ్రత లేకపోవడంతో ఈగలు, దోమలు ప్రబలి ఈ పరిస్థితికి కారణమవుతున్నట్లు చెబుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టడం ద్వారా జ్వరాలను అదుపులో పెట్టవచ్చని, జిల్లావ్యాప్తంగా జ్వరాలు ప్రబలుతున్నందున ప్రతీ గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో కొరవడిన సౌకర్యాలు

సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాల లేమి ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు. జ్వరంతో ఆసుపత్రికి వెళ్లి రోగులకు ఆసుపత్రిలో నిర్వహించే రక్త పరీక్షలు తాలూకు పరికరాలు లేకపోవడంతో రక్త నమూనాలు సేకరించి జిల్లా కేంద్రంలోని డయాగ్నొస్టిక్ హబ్‌కు పంపిస్తున్నారు. ఈ పంపించిన రక్తనమూనాలను పరీక్షించి ఫలితం వెల్లడించే వరకు ఒక్కరోజు సమయం తీసుకుంటుండడంతో జనం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. సంబంధిత సీబీపీ, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ లాంటి పరీక్షలు నిర్వహించేందుకు ప్రైవేట్ ఆసుపత్రులలో రూ.1200 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తుండడంతో సామాజ్యుడి జేబుకు చిల్లు పడుతోందని చెబుతున్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ సెల్ కౌంట్ లాంటి పరికరాలను మండల కేంద్రాలలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



దిలావర్‌పూర్ సబ్‌సెంటర్‌లో వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

రోగులను దోచుకుంటున్న ప్రైవేట్ ఆసుపత్రులు

ప్రైవేట్ వైద్యాన్ని ఆశ్రయిస్తున్న జనం జేబులకు చిల్లులు వేసేందుకు కొంతమంది ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు క్షేత్రస్థాయిలో ఆర్ఎంపీలతో కుమ్మక్కవుతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే కొంతమంది ఆర్ఎంపీలతో తమ ఆసుపత్రులకు పేషెంట్లను పంపేలా ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ఒప్పందాలు చేసుకుంటున్నారు. పేషెంట్లను పంపుతున్న ఆర్ఎంపీలకు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు కమిషన్ రూపంలో ప్రతిఫలాన్ని ముట్టచెబుతూ దోపిడీకి తెరలేపారు. దీంతో సామాన్యుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నకిలీ వైద్యులపై వైద్య, ఆరోగ్య శాఖ నిఘా

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ తెరపైకి కొత్త కొత్త ప్రైవేట్ ఆసుపత్రులు వస్తున్నాయి. గతంలో ఖానాపూర్ లాంటి పట్టణంలో నకిలీ వైద్యుల నిర్వాకం బయటపడిన నేపథ్యంలో ప్రస్తుతం నకిలీ వైద్యులపై పకడ్బందీ నిఘాను ఏర్పాటు చేసినట్లు వైద్య, ఆరోగ్యశాఖ చెబుతోంది. మండలాల్లో సైతం మెడికల్ ఆఫీసర్లు గ్రామస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావాలని అంతకుమించి వైద్యం చేస్తే కేసులు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఈ హెచ్చరికలు ఆచరణకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో మరిన్ని తనిఖీలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.



కుంటాల మండలంలో హెల్త్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎం అండ్ హెచ్‌వో

అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో వారానికి ఒకరోజు డ్రై డే నిర్వహిస్తే జిల్లాలో మాత్రం కలెక్టర్ ఆదేశాల మేరకు వారంలో రెండు సార్లు శుక్రవారం, మంగళవారం డ్రై డే పాటిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాగా క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీల పాలకవర్గాలు లేకపోవడంతో పలు గ్రామాల్లో పారిశుధ్య చర్యలు కుంటుపడినట్లు చెబుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వేళ పారిశుద్ధ్యపై మరింత దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నాం..

• రాజేందర్, డీఎంహెచ్‌వో, నిర్మల్

జిల్లాలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు వారంలో రెండుసార్లు డ్రై డే నిర్వహిస్తున్నాం. నకిలీ వైద్యుల ఆటకట్టించేందుకు పకడ్బందీ నిఘా ఏర్పాటు చేశాం. మండల వైద్యాధికారుల నేతృత్వంలో ఆర్ఎంపీల క్లినిక్‌లను తనిఖీ చేస్తున్నాం. ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్సలకే పరిమితం కావాలి. అంతకుమించి వైద్యం చేస్తే కేసులు నమోదు చేస్తాం.



వాలీబాల్ ఆడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

గంజాయి సాగు చేయడం నేరం

- యువత గంజాయికి బానిసవ్వొద్దు: ఎస్పీ జానకీ షర్మిల
- గిరిజనులకు వాలీబాల్ కిట్లు, రేషన్ సరుకులు

పెంబి, జూలై10 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేయడం చట్టరీత్యా నేరమని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్, కొలంగూడ గ్రామంలో ఎస్పీ గంజాయి వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. యువత గంజాయికి బానిస కావొద్దని చెప్పారు. కల్తీ కల్లుతో జీవితాలు నాశనం అవుతాయన్నారు. కల్తీ కల్లు తాగబోమని, గంజాయి సాగు చేయబోమని గ్రామస్థులతో ఎస్పీ ప్రమాణం చేయించారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర నిషేధిత మాదక ద్రవ్యాలు నిల్వ, విక్రయం జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 100 లేదా 8712659599 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అంతకుముందు గిరిజనులు గుస్సాడీ, డోలు వాయిద్యాలు, మంగళహారతులతో ఎస్పీని ఘనంగా స్వాగతించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించి విద్యార్థులకు బిస్కెట్స్, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం గిరిజనులకు వాలీబాల్ కిట్లు, దాదాపు 100మందికి రేషన్ బియ్యం, రైతులకు ప్లాస్టిక్ కవర్లు అందజేశారు. కార్యక్రమంలో ఐపీఎస్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా, ఖానాపూర్ సీఐ అజయ్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, ఆర్ఐ రమేష్, పెంబి ఎస్సై హనుమండ్లు, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో పార్టీ ముథోల్ ప్రతినిధుల భేటీ

భైంసా, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముథోల్ నియోజక వర్గ పరిధిలోని పలువురు బీజేపీ ప్రతినిదులు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావ్‌తో గురువారం బేటి అయ్యారు. నియోజక వర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోస్లే మోహన్‌రావ్ పాటిల్ సారధ్యంలో పలువురు ప్రతినిదులు రాష్ట్ర అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నియోజక వర్గ పరిధిలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ స్థితి,గతులు చర్చకు వచ్చినట్లుగా సమాచారం. ఈ సందర్భంగా పార్టీ ప్రతినిదులు రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావ్‌కు బాసర అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు.



రాంచందర్‌రావ్‌ను కలిసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావ్ పాటిల్

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

పెంబి, జూలై10 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ పట్టణంలో ఈనెల 12న జరిగే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సల్ల నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలో జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 67కంపెనీలు పాల్గొంటాయని, జాబ్‌మేళాకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



యాంటీ డ్రగ్ పోస్టర్లను విడుదల చేస్తున్న పోలీసులు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

దిలావర్‌పూర్, జూలై10 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు బానిసలైతే జీవితం నాశనమవుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్ అన్నారు. కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, కొకెన్, గ్రామీణ ప్రాంతాల్లో దొరికే కల్తీ కల్లుకు దూరంగా ఉండాలన్నారు. ధూమపానం సైతం ఆయుష్షును తగ్గిస్తుందన్నారు. అనంతరం యాంటీ డ్రగ్ కమిటీని ప్రకటించారు. కమిటీ అధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్, ఉపాధ్యక్షుడిగా నజ్మిన్ బేగం, అధ్యాపకులు, విద్యార్థులను సభ్యులుగా నియమించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై స్థానిక ఏఎస్సై లక్ష్మీనారాయణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్‌లను విద్యార్థులతో కలిసి విడుదలచేశారు. ఏఎస్సై లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ మత్తుపదార్థాలను సేవిస్తూ దాన్ని వ్యసనంగా మార్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్‌క్రైమ్ అనేది కూడా ఈ రోజుల్లో పెద్దసమస్యగా మారిందన్నారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులు పంపే లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికా రులు మాలెపు కృష్ణ, సీనియర్ అధ్యాపకులు ఆనందం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

సారంగాపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని కాపాడే బాధ్యత అందరిదని మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల రాజీవ్ కాటన్ మార్కెట్‌యార్డులో ఆయన మొక్కలను నాటి మాట్లాడారు. ప్రతీ ఇంటి ముందు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శంకర్‌రెడ్డి, అధికారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దిలావర్‌పూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ రాజేందర్ వైద్యసిబ్బందికి సూచించారు. గురువారం దిలావర్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఈ సందర్భంగా వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని సూచించారు. జ్వర పీడితులను గుర్తించి చికిత్సలు అందించాలన్నారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి రోజువారీ ఓపీ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని గదులతో పాటు పరిసరాలను పరిశీలించిన డీఎంహెచ్‌వో రాజేందర్ స్థానిక వైద్యాధికారిని డాక్టర్ ప్రియాంకను అభినందించారు. డీఎంహెచ్‌వో వెంట జిల్లా ప్రోగ్రాం అధికారి డా.సౌమ్య, జిల్లా మాస్ మీడియా అధికారి బారె రవీందర్, ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్, గ్రామ పంచాయతీ ఈవో చంద్రశేఖర్, పంచాయతీ రాజ్ ఏఈ క్రాంతి కుమార్, సీహెచ్‌వో రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్: మాజీ ఎమ్మెల్యే

భైంసా, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సల పొందిన పేద, మధ్య తరగతి వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ అన్నారు. గురువారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలవాసులకు చెక్కులను పంపిణీ అందజేశారు. ఇందులో భైంసా ఆత్మ కమిటీ చైర్మెన్ సిద్దం వివేక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా మహిళాధ్యక్షురాలు దుర్గ భవాని, ఉపాధ్యక్షుడు లక్ష్మీలతోపాటు ఇతర గ్రామాల ప్రజాప్రతినిదులు ఉన్నారు.

శ్రీజ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

నిర్మల్ రూరల్, జూలై10 (ఆంధ్రజ్యోతి): భావితరాల కోసం జిల్లాలో శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని శ్రీజ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయ సాధన సమితి అధ్యక్షుడు నంగె శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన బాసరలో ఉన్నత విద్యావనరులు లేక ఉమ్మడి జిల్లా వాసులు ఎన్నో కష్టాలు పడుతూ జిల్లాను దాటి వెళ్తున్నారన్నారు. మరికొం దరు మధ్యలోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే అందరికీ ఉన్నతవిద్య అందుతుందని పేర్కొన్నారు.



బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

బూత్‌లెవెల్ అధికారులకు శిక్షణ తరగతులు

నర్సాపూర్(జి), జూలై10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వోలు) కోసం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా, శిక్షణ అధికారి విజయ్‌కుమార్ బీఎల్‌వోలకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. అధికారులకు ఓటరు నమోదు విధులు, వాటిలో వారి పాత్ర గురించి సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా ఓటరు పేరులో మార్పులు చేయాల్సిన ప్రక్రియపై స్పష్టమైన సూచనలు ఇచ్చారు. శిక్షణలో బీఎల్‌వోలు గంగామణి, అరుణ, గంగవ్వ, తదితరులున్నారు.

విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

- బాసర ఆర్జీయూకేటీలో వారికి వారే సాటి : కలెక్టర్ అభిలాష అభినవ్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, వీసీ గోవర్ధన్, ఓఎస్డీ



గోదావరి తీరంలో భక్తుల వసతులను పరిశీలిస్తున్న కలెక్టర్

బాసర, జూలై10 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఆర్జీయుకేటీ రాజీవ్‌గాంధీ యూనివర్సిటీఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపకులపతి చాంబర్‌లో అధికారులు, బోధన సిబ్బందితో సమావేశమై, విద్యార్థులకు అందిస్తున్న బోధన, వసతులపై స మీక్ష నిర్వహించారు. ప్రవేశాల ప్రక్రియ, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రవేశాల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. బోధనేతర సిబ్బంది సమర్థవ ంతంగా పనిచేయాలన్నారు. అనంతరం విద్యార్థులే ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్ బాసర ట్రిపుల్ ఐటీ దేశానికే గర్వకారమని,విద్యార్థులే యూనివర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్లని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోధన, బోధనేతర అంశాల్లో సమీక్షలు నిర్వహిస్తూ.. సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. వర్క్‌షాపుల స్థితి, అకాడమిక్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహి ంచారు. కలెక్టర్ నైపుణ్యాభివృద్ధి ప్రధానంగా ఉండేలా విద్యాబోధన సాగాలన్నారు. ఆగస్టులో భోజనశాలకు కొత్త గుత్తేదారు నియమిస్తామని భోజనశాల విస్తరణతో పాటు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం యూనివర్సిటి ప్రాంగణాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న వసతులను పరిశీలించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో రూ.3.20 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్ పనులను పరిశీలించి విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా మంచి తినుబండారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపకులపతి గోవర్ధన్, ఓఎస్డీ మురళీదర్శన్, ఇన్‌చార్జ్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ పవనచరంద్ర, ఎంపీడీవో, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తుల వసతులను పరిశీలించిన కలెక్టర్

బాసర గోదావరి నది తీరంలో భక్తుల వసతి సౌకర్యాలను గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఇటీవల ఐదు గురు భక్తులు గోదావరి స్నానం కోసం నదిలో దిగి మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పటినుంచి బాసర గోదావరి తీరంలో భక్తులపై సమస్యలపై, ముందస్తు రక్షణ చర్యలపై కలెక్టర్ దేవస్థానం పోలీస్ అధికారులను ఆరా తీశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం 12న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా, జిల్లా ఇన్ చార్జీ జూపల్లి కృష్ణారావు పర్యటన నేపథ్యంలో మంత్రులు ప్రారంభించే భవనాలను ఇతర కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు.



పోర్టల్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి

• అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

నర్సాపూర్(జి), జూలై10(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. భూభారతి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఎలా పరిష్కరిస్తున్నారో తహసీల్దార్ శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. పాస్ బుక్‌లో భర్తపేరు సరిదిద్దడం వంటి సేవలు ఏ విధంగా అందిస్తున్నారో భూభారతి ఆపరేటర్ రవిని తన ల్యాప్‌టాప్‌లో లాగిన్ అయి వివరించాలని చెప్పగా సాంకేతిక ప్రక్రియను సమగ్రంగా వివరించడంతో ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. తహసీల్దార్ కార్యాలయ సందర్శనలో భాగంగా అదనపు కలెక్టర్ రికార్డు గదిని కూడా పరిశీలించారు. రెవెన్యూ, సదస్సులలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ప్రాధా న్యతతో పరిష్కరించాలని, జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే తమ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ రేషన్ కార్డులపై ప్రత్యేక దృష్టి

పెండింగ్‌లో ఉన్న 142 రేషన్ కార్డుల దరఖాస్తుల గురించి అదనపు కలెక్టర్ ఆరా తీశారు. వీటిని వెంటనే పరిశీలించి (వెరిఫికేషన్), రెండు రోజుల్లోగా సివిల్‌సప్లై అధికారిక పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. తహసీల్ కార్యాలయసిబ్బంది గురించి వివరాలు తెలుసుకున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కుంటాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని ఎస్‌బీఎం ప్రతినిధి ప్రియాంక అన్నారు. గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లాలో 20 గ్రామాలు ఎంపిక కాగా ఇందులో కుంటాల మండలంలోని కల్లూరు, దౌనెల్లి గ్రామాలు ఎంపిక కాగా, ఇందులో భాగంగానే గురువారం మండలంలోని దౌనిల్లి గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో మురికి కాల్వల నిర్వహణ, తడిపొడి చెత్త కేంద్రాల నిర్వహణ, ఇంకుడు గుంతల నిర్వహణ, తదితర వాటిని గ్రామంలో పరిశీలించారు. అంతేగాకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు, ప్రజలు ఇళ్లలో సొంతంగా నిర్మించుకున్న మరుగుదొడ్లను సైతం ఆమె పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యావ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

సోన్, జూలై10 (అంధ్రజ్యోత): మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన పట్నం పోశెట్టి (34) గురువారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పోశెట్టి దుబాయ్‌లో వెళ్లి అప్పుల పాలయ్యాడు. మూడేళ్ల క్రితమే వివాహం కాగా భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్థాపానికి గురై తన ఇంటిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహ్యా చేసుకున్నాడు. మృతుడి అక్క రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి వెల్లడించారు.